# దేవుడిపై కోపం

గుర్నాథానికి మహాకోపమొచ్చిందవాళ !

పెళ్ళికెదిగి కూర్చున్న తన పుత్రికాత్రియం మీద కాదు.

కనీసం పెద్దకుమార్తె పెళ్ళయినా చెయ్యలేని తన అప్రయోజకత్వాన్ని, అదేపనిగా అవహేళనచేస్తున్న పెళ్ళాంమీద కాదు.

తను చేస్తూంన్న దరిద్రగొట్టు ఉద్యోగంమీదకాదు.

తను తనవాళ్ళూ రోజూ తింటూంన్న దరిద్రగొట్టు తిండి మీదకాదు.

ఉంటూంన్న దిక్కుమాలిన అద్దెకొంపమీద కాదు.

అతనికవాళ అంతటిమహాకోపమొచ్చింది; ఎవ్వరికీ అగుపించకుండా అంతటావున్నాడనే దేవుడిమీద !

గుర్నాథంవంటి మహాభక్తుడికి దేవుడిమీద అంతటి మహాకోపం రావడమనేది చాలా ఆశ్చర్యకరమైన విషయం ! ఎంచేతంటే; ఏదో ఆపదసమయాలలో మాత్రమే దేవుణ్ణి స్మరించేటటువంటి అల్పస్థాయి భక్తుల కోవలోకి రాడు గుర్నాథం !

అతడు రామాయణం చదివేడు. భారతం చదివేడు. భాగవతం చదివేడు. ఇకపోతే భగవద్గీతసంగతి సరేసరి ! అది అతడి నిత్యపారాయణ గ్రంథం !....

ఒక ఉత్తరం వ్రాసినా, చాకలిపద్దు వ్రాసినా... అసలు ఏది వ్రాసినా సరే — ముందుగా కాగితంమీద "శ్రీరామ" అని వ్రాయడం అతనికలవాటు!.... రాత్రి పడుక్కోబోయేముందు, ఉదయం నిద్రలేచేముందు అరచేతిపై "శ్రీరామ" అని వ్రేలుతో వ్రాసి, దండం పెట్టి, రామనామాన్ని జపించడం; అతని భగవదారాధనలో ఒకభాగం!

శని, ఆదివారాలు ఒంటిపూటు; మంగళవారంనాడు పూర్తిగాను ఉపవాసాలు చెయ్యడం అతని ఆస్తికతకు నిదర్శనాలు!

ఇంచుమించు పదిహేనేళ్ళవుతోంది; అతను 'రామకోటి' వ్రాయడం ప్రారంభించి!

ఇంతట్లోనే ఈ వైపరీత్యం!

కోపాన్ని అదుపులో పెట్టుకోలేక దేవుడిపై తిరగబడ్డాడు గుర్నాథం!...

మొట్టమొదట రాముడివిగ్రహంతీసి నేలకేసి కొట్టేడు అది రాతివిగ్రహమయున్నట్లయితే అంత సులభంగా అన్ని ముక్కలు కాకపోయుండేది!... సీతకి, లక్ష్మణుడికి, హనుమంతుడికి అదేగతి పట్టింది!...

ఆ తరువాత పార్వతీపరమేశ్వరుల విగ్రహాలను నేలకేసి కొట్టేడు;....

గదంతా మట్టిబెడ్డలు!... విగ్రహాల ముక్కలు!

వైపు దగ్గరనుండి బిందెతోనీళ్ళు పట్టుకొస్తూన్న గుర్నాథం భార్య "అన్నపూర్ణ"; ఈ దృశ్యాన్నిచూసి నిర్ఘాంతబోయింది!

"ఏవండీ ఈ విగ్రహాలనిలా పగలగొట్టింది......" ఆమె యింకా పూర్తిగా అడగక మునుపే,

"నేనే!" అని సమాధానమిచ్చేడు గుర్నాధం.

"మీరా?.... మీకేం పిచ్చెత్తిందా ఏంవిటి?.... ఏంవిటీ పని?" అని నేలమీద ముక్కముక్కలుగా పడివున్న విగ్రహాల కేసి బితుకు బితుకుగా చూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"పిచ్చెత్తడంకాదే!... పిచ్చివదిలింది. ఇన్నాళ్ళయి నన్ను పట్టుకున్న దేవుడిపిచ్చి యీనాటితో వదిలిపోయింది!"

"ఏంవిటండీ యీమాటలు ?.... మీ మాటలు వింటూంటే నాకేదో భయంగావుంది !....

"దేనికే భయం?.... ఈ దేవుళ్ళపై తిరుగుబాటుచేస్తున్నందుకుగాను, ఈదేవుళ్ళు నన్నేమయినా చేస్తారనా నీభయం?. మరేం భయంలేదు !.... అంతపాటిశక్తి మనం దేవుళ్ళుగా భావించి, ఆరాధిస్తున్న వాళ్ళెవరికీ లేదని నాకు తెలిసిపోయింది. అట్టి శక్తే వాళ్ళకున్నట్లయితే, యిట్లా నేను నేలకేసి బాదినప్పుడు ప్రతిఘటించి ఉండేవాళ్ళు !... నిర్జీవమైన మట్టి ముద్దల్లోను, కఠినపాషాణాలలోను, ఏదో మహాత్తు ఉన్నాదనే భ్రమతో, ఇన్నాళ్ళయి యీనిర్జీవపదార్థాల్ని ఆరాధించేటందుకై ఎంతో అమూల్యమైన కాలాన్ని వృథాచేసుకున్నాను. ఇటుపైన ఇట్లాంటి తెలివితక్కువపని చెయ్యను".

"ఇక చాలించండీమాటలు. తీవ్రమైన నిరాశా నిస్పృహలకు లోనై మతిస్థిమితాన్ని పోగొట్టుకున్నవారు తప్పితే మరెవ్వరూ ఇట్లా మాట్లాడరు!" నీళ్ళబిందెను కుదురుమీద దించుతూ అంది అన్నపూర్ణ.

"ఇప్పుడు నామతి సక్రమమైన పద్ధతిలో కుదుటపడింది. ఇంతకాలమై నామనస్సులో పేరుకుపోయున్న కుళ్ళును, సంపూర్ణంగా ఈనాడు కడిగివేశాను. ఇప్పుడు నామనస్సు నిష్కల్మషంగావుంది!"

"మీరేమంటున్నది నాకు బోధపడలేదు !"

"ఇంత స్పష్టంగా చెప్తున్నా నీకు బోధపడలేదా? .. మన బోటివాళ్ళు తరతరాలనుండి ఆరాధిస్తున్న దేవుడు—డబ్బూ, అధికారంగల స్వార్థపరులు సృష్టించినఒక జడపదార్థం!...అంతా దైవేచ్ఛ అనే నమ్మకంతో, ఏపనీచెయ్యకుండా, అంతా దేవుడిపై భారంవేసి; సోమరిపోతుల్లాగ కూర్చొనేవాళ్ళ సంఖ్య ఏదేశంలో అధికంగా ఉంటుందో, ఆదేశం ప్రగతిపథంలో ఒక్క అడుగుకూడా ముందుకువెయ్యలేదు! ...ఇప్పుడర్థమయిందా?" అంటూ భార్యముఖంలోకి నిశితంగా చూసేడు గుర్నాధం

ఏమీ అర్థంకాలేదు అన్నపూర్ణకు.

తన భర్త ఎన్నడూ ఈ తీరులో మాట్లాడలేదు. ఇంతకీ ఏం జరిగింది?..... ఈ వైపరీత్యానికి హేతువేమిటి?..... రామకోటి వ్రాసేటప్పుడు ఏదైనా దోషం జరిగితే బెడిసికొడుతుందంటారు! కొంపతీసి బెడిసికొట్టలేదుకదా?..... ఏమో!..... ఇదంతా దాని ఫలితమేనేమో !..... .....

అన్నపూర్ణకు భయమేసింది. ఏవరినైనా పిలవాలనుకుంది. వీధిలోకెళదామని బయలుదేరబోయేసరికి, పెద్ద కూతురు 'సీత' ఎదురయింది.

"సీతా!.... మీ నాన్నగారికి పిచ్చెత్తినట్లుందే!....దేవుళ్ళ విగ్రహాలన్నీ నేలకేసి చితక్కొట్టేరు!.... దైవ దూషణచేస్తు న్నారు. పరమ ఆస్తికులయిన మీనాన్నగారు ఇట్లా అకస్మాత్తుగా నాస్తికులుగా మారిపోడం చూస్తే నాకేదో భయంగా వుంది! వారి మతిచలించిందేమోనని నాకనుమానంగావుంది!."

అని చెప్పింది అన్నపూర్ణ.

సీత గాభరాగా తండ్రి దగ్గరకొచ్చి, "నాన్నగారూ! ఏమి టిదంతా?" అనడిగింది; నేలపై చెల్లాచెదురుగాపడివున్న విగ్ర హాల ముక్కలకేసి ఆందోళనతో చూస్తూ.

"ఇవన్నీ ఎత్తిపారేయి, పెంటకుప్పమీద!" అని అన్నాడు పాదాలతో చితికిన విగ్రహాల ముక్కలను ఒక దగ్గరకు కూడదీస్తూ.

"ఇంతకీ ఏమయింది నాన్నగారూ?.... ఇవాళ దేవుడిపై మీకింత కసి ఎందుకేర్పడింది?" అనడిగింది సీత.

"ఇంతకాలమయి ఈ ప్రపంచంలో ఒక్క దేవుడే సత్య మనుకున్నాన. కాని దేవుడే అసత్యమని, ప్రకృతే సత్యమని యిప్పుడు తెలుసుకున్నాను!"

"నాన్నగారూ!.... మీ మనస్సుపై ఏదో గట్టిదెబ్బ తగిలి నట్లుంది! లేకపోతే మీరిట్లా మాట్లాడరు!.... ఏం జరిగిందో చెప్పండి?" అని తండ్రి ముఖంలోకి పరిశీలనగాచూస్తూ అడిగింది సీత.

గుర్నాథం వెర్రివాడిలాగనవ్వి, "చెప్పమంటావా?....

చెపితే మీ అమ్మ పిచ్చెత్తిపోతుంది! లేదా ఆత్మహత్య చేసుకుంటుంది!'' అని అన్నాడు.

ఏమీ అర్థంకాక ఆతల్లీకూతుళ్ళిద్దరూ ఒకరిముఖాలకేసొకరు అయోమయంగా చూసుకున్నారు.

అన్నపూర్ణ ఎంతో ఆందోళనతో, ''ఇంతకీ ఏంజరిగిందండీ? వేగంగా చెప్పండి?" అనడిగింది.

''చెపితే నువ్వు భరించలేవు!'' అన్నాడు గుర్నాధం.

''భరిస్తాను ఎంతటి విషాదాన్నయినా భరిస్తాను. త్వరగా చెప్పండి.'' అని తొందరచేసింది అన్నపూర్ణ.

''చెప్తాను చెప్పేముందు నీరెండోకూతురు ''లక్ష్మి''ని యిట్లా పిలువు.''

''అదిప్పుడు యింట్లోలేదు."

''ఇంట్లోనేకాదు ఊళ్ళోకూడాలేదు!'' అని గుర్నాధం అనేసరికి,

అన్నపూర్ణ గుండె వేగంగా కొట్టుకోసాగింది !.... సీత మనస్సు ఆందోళనతో ఆరాటుపడసాగింది.

''లక్ష్మి ఎక్కడికెళ్ళింది నాన్నగారూ?'' అని ఎంతో ఆందోళనతో అడిగింది సీత.

"ఏమో! ...తెలీదు. అది వ్రాసిన ఈ ఉత్తరంలో ఆవివరాలేవీలేవు!" అని ఓ ఉత్తరాన్ని సీతచేతికిచ్చి, ''మీ అమ్మకు చదివి వినిపించు!" అని అన్నాడు

సీత ఎంతో ఆత్రంగా ఉత్తరం మడతవిప్పి, ఓసారి మన స్సులో చదువుకొని ఎంతో బాధగా నిట్టూర్చింది !....

"ఏమని వ్రాసిందే?... బయటకు చదువే!" అని గుండె బిగబట్టుకొని ఎంతో ఆందోళనతో అడిగింది అన్నపూర్ణ.

"చదువుతాను. విను!.... "ప్రియమైన నాన్నగారికి నమస్కారములు!.... మీ భగవదారాధన వేళల, మీ పిల్లలంతా గౌరవప్రదంగా, ఆనందంగా జీవించేటట్లు వరమివ్వమనే ప్రార్థన ఉన్నదని నాకుతెలసు ! ... అయితే మీరు ఓ వ్యక్తిత్వంగల పురుషుడిగా చెయ్యవలసినదేమీ చెయ్యకుండా, కర్తవ్య శూన్యులై భగవదారాధన అనేపేరుతో ఓ సోమరిపోతులా కాలాన్ని వ్యర్థపరుస్తున్నారు! .. సంప్రదాయమనే ఉక్కుచట్రంలో ఇరుక్కుపోయి - మూఢాచారాలనే ఇనుప చక్రాలక్రింద నలిగిపోతూ - చావలేక, చావురాక బ్రతుకుతున్నాం మనం!— మన యీ దౌర్భాగ్యస్థితికి ఓ ముగింపు నివ్వాలనే సంకల్పం కల్గిందినాకు!.... అందుకనే నేను మీకు దూరమవాల్సొచ్చింది' నన్ను మన్నించండి !.........ఇట్లు..... మీ లక్ష్మి. ..........విన్నావా అమ్మా!....మన దౌర్భాగ్యస్థితికి లక్ష్మియిచ్చిన ముగింపు!" అనంది సీత అశ్రుపూరిత నయనాలతో.

తన పాదాలక్రిందవున్న భూమి, ఒక్కసారి విచ్చిపోయి నట్లనుభూతినొందింది అన్నపూర్ణ!... ఆమె గుండె, గొంతుకలో కొట్టాడసాగింది. ఏదో అడగాలనుకుంది. కాని ఆమె గొంతుకలోంచి ఏమాటా వెలువడలేదు.

"నాన్నగారూ!.... లక్ష్మి ఎక్కడికి వెళ్ళుంటుంది?" అనడిగింది సీత; పొంగి వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా అణచుకుంటూ !

"బహుశా చావడానికి వెళ్ళుంటుంది!" నిర్లిప్తంగాచూస్తూ సమాధానమిచ్చేడు గుర్నాధం.

"అయ్యయ్యో !.... ఏంటండీ ఈమాటలు ?.... తక్షణం పోలీసువారికి రిపోర్టుచేసి, వెతికించండి!" అనంది అన్నపూర్ణ రుద్ధకంఠంతో.

గుర్నాధం బాధగా నిట్టూర్చి, "ఏమని రిపోర్టిమ్మంటావు? ఏ నీచుడితోనైనా లేచిపోయిందనా? — లేక ఏదుర్మార్గుడైనా దానిని వంచించి లేవదీసుకు పోయేడనా?— ఏమనిమ్మంటావు రిపోర్టు ?.... ఇంతకీ అది ఎంతోమంచిపని చేసింది!.... దాని బాధ మనకొదిలిపోయింది !" అని అన్నాడు.

"ఏంటీ? .. దాని బాధ మనకొదిలిపోయిందా?....కన్న తండ్రిగా మీరనవలసిన మాటేనాయిది?" దుఃఖమిళితమైన కోపంతో భర్తముఖంలోకి అసహ్యంగాచూస్తూ అడిగింది అన్నపూర్ణ.

"ఇంకేమనమంటావే? .... ఓ కన్నతండ్రిగా కన్నపిల్లలకు నేనేంచేసేను?.... ఏమీ చెయ్యలేదు!.... ఆ భగవంతుడే ఏదో చేస్తాడనే నమ్మకంతో నేనింతకాలమయి భగవదారాధన అనే ముసుగులో ఒదిగి కూర్చున్నాను !.... నా చేతకానితనాన్ని, అప్రయోజకత్వాన్ని, అయోగ్యతను భగవద్విలాసమనే తెర మరుగున మరుగుపరచేను. అంతా కర్మబద్ధులనే నమ్మకంతో

కర్తవ్యాన్ని విస్మరించేను !.... నా రక్తాన్ని పంచుకుపుట్టిన లక్ష్మి' నాకీనాడు కర్తవ్యాన్ని బోధించింది!.... అందుకు దానికి నేనెంతయినా ఋణపడివుంటాను!........" గుర్నాధం గొంతుక బొంగురుపోయింది!.... ఊపిరి ఆడనివ్వని పరమ జుగుప్సాకరమైన కఫంలాగ, అతని గొంతుకలో అవ్యక్తమయిన బాధ కొట్లాడసాగింది.

సీత ఆందోళనతో, "నాన్నగారూ !.... మీ మాటలు వింటూంటే నాకేదో భయంగావుంది!" అనంది

"ప్రతిదానికి భయపడేవాళ్ళిలోకంలో ఏపనీచెయ్యలేరు!" అని కొంచెంసేపాగి, గొంతుక సవరించుకొని, "పిరికివాళ్ళి వ్యవస్థలో సుఖపడలేరు. సుఖపడాలంటే పిరికితనాన్ని త్యజించాలి! తమ స్వశక్తిపై నమ్మకం తేనివాళ్ళే, పిరికివాళ్ళవుతారు. పిరికివాళ్ళే పూర్తిగా భగవంతుడిపై భారంవేసి, పురుషప్రయత్నం మానేసి, సోమరిపోతుల్లాగ జీవిస్తారు!.... ఇకపోతే...." గుర్నాధం ఇంకా ఏదో చెప్పబోతూండగా, మధ్యలో అన్నపూర్ణ అడ్డుతగిలి,

"ఇక చాలించండి మీ ఉపన్యాసం!—మీ ఉపన్యాసాన్ని తిరిగ్గా వినగలిగే సహనం, స్థైర్యం మాకిప్పుడు లేవు. ముందు కర్తవ్యాన్ని ఆలోచించండి." అనంది చిరాగ్గా.

"ఇహ ఆలోచించడానికేముంది? - అది వెళ్ళిపోయింది. చావడానికే వెళ్ళిపోయిందో, సుఖంగా బ్రతకడానికే వెళ్ళిపోయిందో మనకు తెలియదు!....ఇంతకీ అది చిన్నపిల్లేంకాదు!.... నాకే కర్తవ్యాన్ని బోధించిన లక్ష్మి, తన కర్తవ్యాన్ని తాను ఎన్నడూ విస్మరించదు!.... నాకిప్పుడు దానిగురించి ఏవిచారం

లేదు! నాకిప్పుడున్న విచారమల్లా సీతగురించే!'' అని భార్య ముఖంలోకి బాధగా చూస్తూ అన్నాడు.

తండ్రి అలా అనేసరికి సీత తెల్లబోయింది!.... ''నాగురించి మీకెందుకు విచారం నాన్నగారూ?" అనడిగింది.

''ఇప్పుడు నీవయస్సెంతోతెలుసా?.... ముప్పై నాలుగేళ్ళు నీకు నేనింతవరకు పెళ్ళి చెయ్యలేకపోయేను!.... ఎందువల్లో తెలుసా? దారిద్ర్యంవల్ల!.... నేటి మన ఈ సమాజాన్ని ధనం శాసిస్తోంది. ధనానికున్న విలువ నేటి మనసమాజంలో మరి దేనికీలేదు! ధనం ఇమ్మనమని భగవంతుడిని ప్రార్ధించడం కోసం వినియోగించిన కాలాన్ని; ఏదో ఒక విధంగా ధనాన్ని సంపాదించడంకోసంగాని — ధనానికి అట్టే విలువనివ్వని, సమసమాజస్థాపనకోసం కృషిచేస్తున్న వారికి సహకరించడం కోసంగాని నేను వినియోగించుంటే ఒక మంచిపని చేసేననే సంతృప్తయినా నాకు మిగిలుండేది!.... కాని యిప్పుడు. ..."

''నాన్నగారూ!.... మీరు మళ్ళీ ఉద్రిక్తులవుతున్నారు. ఈ సమయంలో మీరీ రకంగా ఉద్రిక్తులవడం మంచిదికాదు. లక్ష్మి ఎక్కడున్నది నేను భోగట్టా చేస్తాను. మీరు నిర్విచారంగావుండండి." తండ్రిని శాంతపరచేటందుకు పూనుకుంది సీత.

అదే సమయంలో సీత రెండోచెల్లెలు ''ఉమ'' కాలేజీనుండి వచ్చింది.

ఉమ ముఖంలోకి గుర్నాధం ఓ పిచ్చివాడిలాగ చూస్తూ, ''అమ్మధ్య నువ్వు ఎవడితోనో తిరగడంచూసి, వాడితో ఎప్పుడూ తిరగొద్దని నిన్ను మందలించేను ! నిన్ను ఆనాడలా మందలిం

చినందుకు, ఇప్పుడు నేనెంతో విచారిస్తున్నాను నీయిష్టమొచ్చి నట్లు నీ యిష్టమొచ్చినవాడితో తిరుగు! ఇహ నేనేమీ అనను!.... బాగా డబ్బు సంపాదించడంకోసం యిటుపైని నువ్వేంచేసినా నేనానందిస్తాను!.... బోధపడుతోందా నేను చెప్తున్నది?.... నేను చాలా స్పష్టంగ నే చెప్తున్నాను. ఎంతటి అవివేకులకయినా బోధపడేటంత తేట తెల్లంగా చెప్తున్నాను! మన ధ్యేయం; ఏదో ఒకవిధంగా డబ్బు సంపాదించడం!.... తెలిసిందా?" అనడిగేడు

ఉమకేమీ అవగతంకాలేదు!.... తల్లికేసి, అక్కయ్యకేసి అయోమయంగా చూడసాగింది!

సీత, తండ్రిదగ్గరకెళ్ళి దీనంగా అతని ముఖంలోకి చూస్తూ, "ఊరుకోండి నాన్నగారూ!.... మీ ధోరణి చూస్తూంటె మా కందరికీ మతిపోతోంది. లక్ష్మి ఏమయిందా అనే బెంగతో యిప్పటికే అమ్మ సగం కృంగిపోయింది. మీరీతీరులో యింకా మాట్లాడినట్లయితే, అమ్మ ఏమయిపోతోందోనని నాకు బెంగగా వుంది." అనంది.

"అవునే!.... నీకు బెంగగానేవుంటుంది. ఓ కోమటికొట్టు గుమస్తాగా పనిచేస్తున్న మీయీనాన్న, ఈ కుటుంబాన్ని పోషించలేడనే బెంగతోనేగా నువ్వు ఉద్యోగం వెలగబెడుతున్నావు?.... ఎవడినో ఒకడిని పెళ్ళిచేసుకొని, అత్తారింటికిపోతే నీ యీ దరిద్రగొట్టు తండ్రి ఒక్కడూ ఈ కుటుంబాన్ని పోషించలేడనేగా, ప్రకృతి సహజమైన వాంఛల్ని చంపుకొని మరీ నువ్వీ ఉద్యోగంచేస్తున్నావు?.... నాకు తెలుసే నీసంగతి! నీకోసం నువ్వు బ్రతకడంలేదే!.... నువ్వు మాకోసం బ్రతుకుతున్నావు!.... సుఖమంటే ఏమిటో నీకు తెలుసా?.... ఊహు!

నీకుపెళ్లి.........నీకుపెళ్లి ........" గుర్నాధం నోట్లోంచి ఇంకే మాటా వెలువడలేదు. తుప్పలా కూలిపోయేడు!....

అన్నపూర్ణ కెవ్వుమని కేకేసి భర్తదగ్గరకెళ్లి అతని ముఖాన్ని చేతులతో తడుముతూ, "ఏమండీ?.... ఏమయిందండీ?.... మాట్లాడరేమండీ?" అని ఏడవసాగింది.

సీత ఎంతో ఆందోళనతో, "ఒసేయి ఉమా! నువ్వెళ్ళి అర్జంటుగా డాక్టర్ని తీసుకురా!" అవంది.

ఉమ డాక్టర్ని తీసుకొచ్చేటందుకై పరుగెట్టింది.

సీత, తండ్రిముక్కు దగ్గర చెయ్యిపెట్టి చూసింది. ఊపిరి ఆడుతోంది. గుండెమీద చెయ్యిపెట్టింది. గుండె కొట్టుకొంటోంది! ఆమె గుండె కాస్తా కుదుటపడింది!

అన్నపూర్ణ ఏడుపువిన్న యిరుగు పొరుగువారంతా వచ్చి చుట్టూమూగేరు. పరిస్థితిని గమనించేరు!.... దేవతా విగ్రహాలను చితక్కొట్టిన పాపం ఊరికినేపోదని కొందరు గుసగుసలాడుకోసాగేరు!

తన తండ్రిలాగే ఈనాడు చాలామంది, భగవంతుడిని కోరిన కోర్కెలనీడేర్చే మహామహిమాత్ముడైన ఓ దివ్యస్వరూపునిగా భావించి ఆరాధిస్తున్నారు!.... కోరిన కోర్కెలీడేరక పోయేసరికి, తన తండ్రిలాగే నిరాశా నిస్పృహలకు లోనవుతూ కుమిలిపోతున్నారనుకుంది సీత!

దైవాన్ని సమాజరూపంలో దర్శించి సేవించమని మన ప్రాచీన భారతీయసంస్కృతి చెపుతోంది!.... దేహధారణ కొరకు ఎంత అవసరమో అంతమాత్రమే స్వీకరించమని, అంత

కన్నా అధికంగా స్వీకరించడం దండనార్హమైన నేరమని మహర్షులు నిష్కర్షగా చెప్పేరు !.... కనీసావసరాలకు మించి ఆర్జించడం మహాపాపమని వక్కాణించేరు. సమాజసేవే, దైవ సేవనే సనాతన ధర్మాన్ని మనం ఖచ్చితంగా ఆచరించున్నట్లయితే ఈనాడీరకమైన వికృత పరిస్థితులీసమాజంలో తలెత్తివుండేవికావని సీత యొక్క అభిప్రాయం

కష్ట సుఖాలనేవి మనిషియొక్క మానసిక పరిపక్వతపైన, విచక్షణాజ్ఞానంపైన ఆధారపడుండే అనుభూతులు !

తనపై ఆధారపడి జీవిస్తున్న వాళ్ళెవ్వరూ సుఖపడ లేదేమోనని తన తండ్రియొక్క బాధ !

తన తండ్రికి ఆరకమైన బాధలేకుండా చెయ్యాలనుకుంది సీత !

డాక్టరొచ్చేడు చూసేడు. బహుశా మెదడులో రక్తనాళం చిట్లివుండవచ్చన్నాడు. తక్షణం విశాఖపట్నం కింగ్‌జార్జి ఆసుపత్రికి తీసుకుపొండన్నాడు.

కాని గుర్నాధాన్ని విశాఖపట్నం తీసుకెళ్ళాల్సిన అవసరం మరిలేకపోయింది !

[1975, ఫిబ్రవరినెల, "యువ" మాసపత్రికలో]
ప్రచురింపబడింది.